క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రం తనిఖీ



శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకట రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఆరోగ్య కేంద్రంలో వసతులు, రోగులకు అందుతున్న సేవలు పరిసరాలు పరిశుభ్రత, ల్యాబ్ ద్వారా రోగులకు అందుతున్న ఆరోగ్య సేవలపై వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. అలాగే వైద్యశాల్లో వైద్యాధికారులు సిబ్బంది పనితీరు సమయపాలన రికార్డులు తనిఖీ చేశామన్నారు. నివేదికను జిల్లా కలెక్టరుకు పంపుతామన్నారు. ఆయనతో పాటు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సులు బాలిబోయిన లక్ష్మీప్రసన్న, ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్స్ సతీష్, సీతారామిరెడ్డి ఉన్నారు.

యడ్లపాడులో క్యాటిల్ షెడ్డుకు శంకుస్థాపన



నాదెండ్ల: మండల కేంద్రమైన యడ్లపాడులో పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా ఎస్ఆర్‌జీఎస్ పథకం ద్వారా రూ.2.3 లక్షలతో నిర్మించే క్యాటిల్ షెడ్‌కు అధికారులు శంకుస్థాపన నిర్వహించారు. ఎంపీడీవో హేమలత, పంచాయతీ కార్యదర్శులు శశికళ, మాధవి, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హేమలత మాట్లాడుతూ, ఈ పథకంలో 10 శాతం లబ్ధిదారుని వాటా, మిగిలిన 90 శాతం మొత్తాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందిస్తుందన్నారు. ఈపథకం గొర్రెలకు, కోళ్ళకు షెడ్ల నిర్మాణం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీవో మురళీ, నాయకులు పి వెంకయ్య, ఉపసర్పంచ్ గోనుగుంట్ల హరిబాబు, రాఘవయ్య, రామారావు పాల్గొన్నారు.

బేబీఅన్నా జ్ఞానశిఖకి ఇండియా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



వినుకొండ(నూజెండ్ల): స్థానిక గీతాంజలి లీడ్ స్కూల్ విద్యార్థిని ఇండియా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేయబడిందని పాఠశాల ప్రిన్సిపాల్ టి.కృష్ణవేణి తెలిపారు. 2వ తరగతి విద్యార్థిని బేబీఅన్నా జ్ఞానశిఖ ఒక నిమిషంలో అతి చిన్న వయసులో అత్యధిక హోలా స్పిన్స్ చేసిన బాలికగా నమోదు చేయడం జరిగిందన్నారు. 60 సెకండ్లలో 170 సార్లు హోలారింగ్‌ను స్పిన్‌చేసి ఈ ఘనత సాధించిందని తెలిపారు. చిన్నారిని కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 12 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఏంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల్లో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 12 మంది విద్యార్థినులు ఉద్యోగాలు సాధించినట్టు కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. బెంగుళూరు, హైద్రాబాద్‌లో కార్యాలయాలు నిర్వహిస్తున్న క్యూస్పైడర్ సంస్థ శుక్రవారం కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ జరిపి వ్రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థినులను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను కళాశాల చైర్మన్ ఎం.శేషగిరిరావు, డైరెక్టర్ సాదినేని రామారావు, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ జె.రవిశంకర్, విభాగాధిపతులు రాధికా, సితార, నవీన్‌లు అభినందించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: ప్రమాదవశాత్తు కాలువలో పడి పెదచెరువు ప్రాంతానికి చెందిన గుంజి అంకమ్మరావు(35) మృతిచెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూ టౌన్ పోలీసుల వివరాలు ప్రకారం. పెద్ద చెరువు ఐదో లైన్‌లో నివాసం ఉంటున్న అంకమ్మరావు పెయింట్ పనులు చేస్తుంటాడు. పెద్ద చెరువు ప్రారంభం మార్గంలో ఉన్న అన్న క్యాంటీన్ ప్రక్కన ప్రధాన సైడ్ కాలవలో పడి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి గ్రహణం

త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఆగిన నిర్మాణాలు

వివిధ దశల్లో ఆగిన 3 వేల ఇళ్లు

పేదవాడు హాయిగా నివసించడానికి జగనన్న ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుత పాలక ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోంది. ఓ ఇంటి వారు అవుతున్నామన్న పేదల ఆశలపై నీళ్లు చల్లుతోంది. వెంకుపాలెంలో 120 ఎకరాల్లో 5400 ఇళ్లను నాటి ప్రభుత్వం మంజూరు చేసిన సంగతి అందరికీ విదితమే. రాష్ట్రంలోనే అతిపెద్దదైన ఈ కాలనీలో వివిధ దశల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. అయితే బకాయిలను సాకుగా చూపిస్తూ.. ఈ కాలనీకు ఇప్పటి వరకూ ఉన్న త్రీఫేస్ విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ మండలం వెంకుపాలెం సమీపంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయి లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 120 ఎకరాల్లో 5400 ఇళ్లను మంజూరు చేసింది. అయితే రాష్ట్రంలోనే పెద్దదైన ఈ కాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు నీళ్ల ట్యాంక్‌లను, సబ్ స్టేషన్ ఏర్పాటు చేసింది. అప్పట్లో చకచకా 2 వేల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో పూర్తయ్యాయి. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఇళ్ల నిర్మాణాలకు గ్రహణం పట్టింది. విద్యుత్ శాఖకు హౌసింగ్ డిపార్ట్‌మెంట్ రూ.34 లక్షలు విద్యుత్ బిల్లు బకాయిలు ఉందని త్రీఫేస్ కరెంట్ కట్ చేయడంతో ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఇళ్ల నిర్మాణాలు చేసుకునే లబ్ధిదారులు పూర్తిగా నిర్మాణం ఆపివేసి ఇబ్బందులు పడుతున్నారు.నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024 డిసెంబరు లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వారికి పూర్తిగా బిల్లులు చెల్లిస్తామని గృహ నిర్మాణ శాఖ నిబంధనలు పెట్టింది. అయితే సమయం దగ్గర పడుతున్నప్పటికీ నీటి సౌకర్యం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు ఎలా పూర్తవుతాయని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

దాదాపు 3 వేలకు పైగా ఇల్లు బేస్ మట్టం శ్లాబ్ లెవల్‌లో ఆగిపోయా యి. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడంతో వేలాది మంది లబ్ధిదారులు సొంత ఇంటి కల నెరవేరకుండానే నిర్మాణాలు ఆగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆగిపోయిన జగన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలు

ఇంటి నిర్మాణం నిలిచిపోయింది



మాకు జగనన్న కాలనీలో 2019లో ఇల్లు మంజూరైంది. బేస్‌మట్టం వరకు ఇంటి నిర్మాణం పూర్తయింది. తర్వాత కాలంలో విద్యుత్ నిలిపివేయడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. డిసెంబరు లోపు ఇంటి నిర్మాణం పూర్తయితేనే బిల్లులు ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటి నిర్మాణాలు చేపట్టాలి.

–ఎం.పిచ్చమ్మ, స్థానికురాలు

ఇంటి పనులు ఎలా సాగుతాయి?



మేము పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్నాం. మాకు జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం పూర్తయ్యే సమయంలో కాలనీకి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఇంటి పనులు ఆగిపోయాయి.అధికారులు స్పందించి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటాం.

–భూక్యా కృష్ణవేణిబాయి, వినుకొండ

బిల్లులు చెల్లించకపోవడం వల్లే...

జగనన్న కాలనీకి అర్బన్ హౌసింగ్ శాఖ విద్యుత్ బకాయి రూ.34 లక్షలు ఉండటంతో విద్యుత్ శాఖ సరఫరా నిలిపివేసింది. మున్సిపల్, గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు సమన్వయంతో బిల్లు చెల్లిస్తే విద్యుత్ సరఫరా పునరుద్ధరించి ఇళ్ల నిర్మాణం చేపడతాం.

–శ్రీనివాసరావు, డీఈ, హౌసింగ్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని గుండయ్య తోట, ఆవులదొడ్డి పరిసర ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నాదెండ్ల: గణపవరం 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ధనలక్ష్మీ కాటన్, ఎంఎల్ అండ్ కో, శివస్వాతి టెక్స్‌టైల్స్, వసంత స్పిన్నింగ్‌మిల్స్, తిరుమల కాటన్, కల్పతరువు స్పిన్నింగ్ మిల్స్, పీవీ కృష్ణ కంపెనీలతో పాటూ యడ్లపాడు గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నరసరావుపేట: మరమ్మతుల నిమిత్తం ప్రకాష్‌నగర్ లోని తిలక్‌స్కూలు, రెడ్లబజారులలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీ–2 సెక్షన్ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికకు మైదానం మార్పు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించనున్న ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–14 బాల బాలికల సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమాన్ని నరసరావుపేట లోని ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు బి.ఎం. సుభాని తెలిపారు. వర్షాల కారణంగా పాఠశాలల్లోని ఆటస్థలం అనుకూలంగా లేకపోవటంతో ఈ ఎంపిక కార్యక్రమాన్ని నరసరావుపేట లోని ఎస్ ఎస్ అండ్ ఎన్ కళాశాల మైదానానికి మార్చవలసి వచ్చిందని సైదులు తెలిపారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మెనూ సక్రమంగా అమలు చేయాలి

సాక్షి స్పందన

బొల్లాపల్లి: మండలంలోని సరికొండపాలెం ప్రాథమిక పాఠశాల (హెచ్.సీ)ను ఇన్‌చార్జి ఎంఈవో–1 సయ్యద్ జఫ్రుల్లా శుక్రవారం సందర్శించారు. సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన రుచి–శుచి లేని మధ్యాహ్న భోజన పథకం కథనానికి స్పందించి పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి భోంచేశారు. పాఠశాలలో అమలయ్యే పీఎం పోషణ, శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఎంసీకి సూచించారు. ఆయన వెంట సీఆర్‌పీలు, గ్రామపెద్దలు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో–1 సయ్యద్ జఫ్రుల్లా

మాక్ పోలింగ్‌తో నాయకత్వ లక్షణాలు

శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి

శావల్యాపురం: మాక్ పోలింగ్ కార్యక్రమాలు నిర్వాహణ వలన ఉత్తమ పౌరులుగా, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో యాక్టిజెన్ క్లబ్ వారి సౌజన్యంతో మాక్ పోల్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశ్ అప్నాయెన్ సహయోగ్ ఫౌండేషన్ ద్వారా 6వ తరగతి విద్యార్థులకు మాక్ పోల్ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ఎన్నికల భావనను పరిచయం చేయడానికి ప్రజాస్వామ్యం ప్రభుత్వం పార్లమెంటు పాత్రపై అవగాహన కల్పించి భవిష్యత్‌లో యువ ఓటర్ల మీరేనన్నారు. అలాగే దేశంలోని విలువైన పౌరసత్వ ఆదర్శలను విద్యార్థులు నేర్చుకుంటారన్నారు. అనంతరం అధ్యక్షులుగా ఎన్నికై న కొత్తపల్లి మేఘన, ఉప అధ్యక్షురాలుగా అమృతపూడి ఆరాధ్యలు చేత ప్రమాణ స్వీకారం చేయించి పత్రాలు అందజేసినట్లు స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుబాబు, భువనేశ్వరి, కుమ్మరి శ్రీనివాసరాజు, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మెల్యే చదలవాడకు దురహంకారం పనికిరాదు

- కనీసం కార్మికులను పలకరించకపోవటం శోచనీయం
- రాజకీయ కారణాలతో తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి
- రిలేదీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్

నరసరావుపేట: గత ప్రభుత్వంలో కోర్కెల సాధన కోసం ఆందోళన చేసే కార్మికులకు మద్దతు పలికి అప్పటి ఎమ్మెల్యే దురహంకారంతో ప్రవర్తిస్తున్నాడని విమర్శించిన ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గత పదిహేను రోజుల నుంచి ఆందోళన చేస్తున్న వారిని కనీసం పలుకరించకపోవటం శోచనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పేర్కొన్నారు. రాజకీయ కారణాలతో తొలగించిన కార్మికులు తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలేదీక్షా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. వీరిపట్ల స్థానిక ఎమ్మెల్యే చదలవాడ, కమిషనర్ జస్వంతరావులు శోచనీయంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే తన కుటుంబం వామపక్షాల భావాలు కలిగి ఉందని చెబుతుంటారని, వాస్తవానికి ఆ భావాలు ఉంటే కార్మికులను తొలగించేవారు కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరికి నచ్చిన పార్టీకి వారు ఓట్లు వేసుకుంటారని, తమ పార్టీకి ఓట్లువేయలేదనే కారణంతో గత పదేళ్ల నుంచి పనిచేస్తున్న వారిని తొలగించటం సబబు కాదు అన్నారు. కార్మికులకు పనులు చెప్పి చేయించుకునే కమిషనర్ ఇప్పుడు ఎమ్మెల్యేతో ఒక మాట చెప్పిస్తే వీరిని విధుల్లోకి తీసుకుంటామనటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఇతర పార్టీలు, యూనియన్ల మద్దతుతో తమ ఆందోళనను ఉధృతం చేసి మున్సిపల్ కార్యాలయానికి తాళాలు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగ నాయకులు అల్లాభక్షు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న విజయకుమార్

భార్య మృతికి కారకుడైన భర్తకు రిమాండ్

నరసరావుపేటటౌన్: భార్య మృతి కేసులో భర్తకు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ కాలనీకు చెందిన షేక్ ఖాజా భార్య జానీ బేగం 2020 సంవత్సరంలో భర్త వేధింపులు భరించలేక ఉరివేసుకుని మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడైన భర్తను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడికి రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అతన్ని సబ్‌జైలుకు తరలించారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



రొంపిచర్ల: మండలంలోని అన్నవరం గ్రామ సమీపంలో రొడ్డు పై వస్తున్న ఆవును తప్పించ బోయి ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రొడ్డు పక్కకు దిగి కూరుకు పోయిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో విద్యుత్ స్తంభం కూడా ఉంది. బస్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టకుండా బస్సును నిలువరించాడు. ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామం నుండి ప్రయాణికులతో నరసరావుపేటకు వెళ్తుండగా ఈ ప్రమాదం స్తంభవించింది. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగక పోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.

అయితే రోడ్డుపై వేగంగా రావాల్సిన అవసరం ఏముందని స్థానికులు డ్రైవర్‌ను ప్రశ్నించారు. ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాలేదుగా అన్ని డ్రైవర్ స్థానికులకు నిర్లక్ష్య సమాధానం ఇచ్చారు. నిర్లక్ష్య సమాధానానికి స్థానికులు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు



కొండవీడు గ్రామసభలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జయశ్రీ, అధికారులు అర్జీలు అందించిన రైతులు



కొత్తలూరులో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు



గ్రామసభలో అర్జీను తీసుకుంటున్న తహసీల్దారు వెంకట నాగరాజు



అన్నవరప్పాడులో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

నాదెండ్ల: రీ సర్వేలో జరిగిన భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. తొలిరోజు శుక్రవారం సాతులూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్వేలో భూ కొలతల్లో హెచ్చుతగ్గులు ఉంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మునుగు శోభారాణి, డీటీ ఎన్ ధనలక్ష్మి, వీఆర్వోలు అంజలి, వీరయ్య, పంచాయతీ కార్యదర్శులు రాఘవయ్య, మధుసూదనరావు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యడ్లపాడు..

మండలంలోని కొండవీడు గ్రామంలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు తహసీల్దార్ జయశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. పలువురు రైతులు సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలత, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కనమర్లపూడిలో రెవెన్యూ గ్రామసభ

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామ సభను అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు వేముల వెంకట నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. రీ సర్వేలో తప్పులు సవరణలు భూములు విస్తీర్ణం తేడాలు మార్పులు చేర్పులకు సంబంధించి 20 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు వివరించారు. వెబ్ ల్యాండ్–2 ఆన్‌లైన్‌లో అర్జీదారుల సమస్యలు పరిష్కారిస్తామన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు పెరిసోముల నాసరయ్య, వీఆర్వో నరసింగరావు, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో పల్లెపండుగ

రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం, అన్నవరప్పాడు, అచ్చయ్యపాలెం, చిట్టిపోతులవారిపాలెం, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ ఏఈ సి.హెచ్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ప్రసాద్, సుబ్బయ్యపాలెం నాయకులు ఇంటూరి ప్రసాద్, ఆయా గ్రామాల నాయకు లు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం

శావల్యాపురం: మంచి, కొత్తలూరు, కనమర్లపూడి గ్రామపంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పల్లెపండుగ కార్యక్రమంలో ప్రజలు ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంటూరు సాంబశివరావు, తన్నీరు అంకారావు, ఏపీవో జి.వాసుబాబు, ఏపీయం కె.రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో జరిమానా, జైలు

నరసరావుపేటటౌన్: దాడి కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 1000 రూపాయలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పలపాడు గ్రామానికి చెందిన శివన్నారాయణ 2018 ఫిబ్రవరి 27న ఆస్తివివాదాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వీర్ల అంకయ్య పై దాడి చేశాడు. ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం చేశారు. విచారణలో నేరం రుజువు అవడంతో జరిమాన విధించారు.

మరో కేసులో...

దాడి కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ.1000 రూపాయలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్. ఆశీర్వాదం పాల్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి . గురవాయపాలెం గ్రామానికి చెందిన లేవయ్యా ఆస్తి వివాదాల నేపథ్యంలో 2018 సెప్టెంబర్ 15న అదే గ్రామానికి చెందిన పాలెపోగు కోటి రత్నం మహిళపై వెదురు బొంగుతో దాడి చేసి, దూషించాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న గ్రామీణ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం సీఆర్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో గణపవరం సీఆర్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై నడిచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుంటూరు వైపు నుంచి వస్తున్న వాహనం ఢీకొనటంతో సంఘటనా స్థలంలోనే మరణించాడు. ఢీకొన్న వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలియరాలేదు. మృతుడు ఒడిషా, బీహార్ రాష్ట్రాలకు చెందిన కూలీగా భావిస్తున్నారు.

21న గణపవరంలో విగ్రహ ప్రతిష్ట


నాదెండ్ల: గణపవరం గ్రామంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయంలో శ్రీగంగమ్మ తల్లి పోతురాజుస్వామి వార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఈ నెల 21న జరగనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామం నుంచి అప్పాపురం వెళ్ళే డొంక రోడ్డులో సువిశాల విస్తీర్ణంలో ఆలయంతో పాటూ రెండు విశ్రాంతి గదులు నిర్మించారు. ఈ నెల 19 నుంచి ఉదయం 9 గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 19న ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశం, అంకురారోహణ, అగ్ని ప్రతిష్టాపన, జలాధివాసం జరగనున్నాయి. 20న ఆదివారం వాస్తుపూజా హోమంతో పాటూ దేవతామూర్తులకు క్షీరాదివాసం, విశేష పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. 21న ఉదయం 11 గంటలకు ఆలయ ప్రతిష్టా మహోత్సవం జరగనుంది. అదేరోజు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయంలో ప్రతిష్టించే పోతురాజు, గంగమ్మతల్లి విగ్రహాలను చిలకలూరిపేట పట్టణ పరిధిలోని పురుషోత్తమ పటణంలోని శిల్పశాలలో తయారు చేయించి ఆలయానికి తరలించారు. ఆలయం వద్ద శాంతి హోమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.



గణపవరంలో నూతనంగా నిర్మించిన ఆలయం



గంగమ్మతల్లి విగ్రహం



పోతురాజు విగ్రహం